
ప్రజాశక్తి
బుధవారం 18 జనవరి 2023
5
విజయనగరం



23న సర్కిల్ స్థాయి డాక్ అదాలత్

తపాలా శాఖ సూపరింటెండెంట్ ఈశ్వరరావు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఈ నెల 23న విజయవాడ వేదికగా సర్కిల్ స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విజయనగరం తపాలా శాఖ సూపరింటెండెంట్ ఈశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని తపాలా కార్యాలయాలలో అందించే సేవలకు సంబంధించిన అంశాలపై 23న ఉదయం 11.30 గంటలకు విజయవాడ పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత ఫిర్యాదులను ఈ నెల 18వ తేదీ లోగా మెయిల్ లేదా పోస్టల్ ద్వారా కె. సుధీర్ బాబు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ - 520 013 చిరునామాకు పంపించాలని సూచించారు. పోస్ట్ కవర్‌పై డాక్ అదాలత్ అని స్పష్టంగా రాయాలని ప్రకటనలో తెలిపారు.

రాళ్ల భూములపై రతనాల సాగు

- కొండను పిండిచేసి పండ్ల మొక్కలు నాటిన గిరిజనులు
- ఊటను ఒడిసిపట్టి ఫారం పాండ్లకు మళ్లించిన డ్వామా
- 26 ఎకరాల్లో ఏపుగా పెరుగుతున్న జీడి, మామిడితోట

అదంతా రెండేళ్ల క్రితం వరకు రాళ్లు, రప్పలు, దట్టమైన ముళ్లపొదలతో నిండి ఉన్న ప్రాంతం. అటువైపు వెళ్లాలంటేనే.. అది ఎందుకూ పనికిరాదు, ఎలాంటి ఉపయోగం ఉండదనే భావన. ఔను... అచ్చంగా ఇటువంటి భూమినే గిరిజనులకు ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వం భూమి కేటాయించిందన్న ఆనందం కన్నా రాళ్ల భూములపై పంటలు ఎలా సాగుచేస్తామన్న నిరాశే ఎక్కువగా గిరిజనులను వేధించింది. దీన్ని గుర్తించిన డ్వామా (నీటి యాజమాన్య సంస్థ/ ఉపాధి హామీ) అధికారులు గిరిజనులతో కలగలిసి పంటలు సాగుచేస్తే జీవితాలు మారుతాయని, అవసరమైతే ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని అందిస్తామని మానసిక స్థైర్యాన్ని, మనో నిబ్బరాన్ని కల్పించారు. అదే నిబ్బరంతో కొండను పిండిచేసిన రైతులు రతనాల సాగు చేస్తున్నారు.



ఏడాదిన్నర క్రితం కొండపై మొక్కలను నాటుతున్న గిరిజనులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, నెల్లిమర్ల

నెల్లిమర్ల మండలం రామతీర్థం. ఇది రాష్ట్రంలోని పెద్దగా పరిచయం అక్కర్లేని ప్రాంతం. తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత గుర్తింపుగలిగిన ఆధ్యాత్మిక కేంద్రం ఇది. ప్రభుత్వం తరపున శ్రీరామనవమి ఉత్సవాలు కూడా ఇక్కడ నిర్వహిస్తుంటారు. ఆ విధంగా ఇక్కడికి వచ్చే సందర్భాలకు కనిపించే బోడికొండకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంపై ఆధారపడుతూ ఇదే గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలు దశాబ్దాల తరబడి కాలం వెళ్లదీస్తున్నాయి. వీరికి సాగుభూమి ఇవ్వడం ద్వారా జీవనోపాధి మెరుగుపర్చాలని సంకల్పించిన ప్రభుత్వం 2020లో 18 మంది గిరిజన రైతులకు ఆర్ఒఎఫ్ఆర్ పథకం కింద సుమారు 26 ఎకరాల భూమికి పట్టాలు మంజూరు చేసింది. పట్టాలైతే వచ్చాయిగానీ, కేటాయించిన భూమి మొత్తం రాళ్లు రప్పలతో నిండి ఉంది. వాటిని ఆవరించి దట్టమైన ముళ్లపొదలు. సాగునీటికి అవకాశమే లేదు. ఇటువంటి భూమిలో పంటలు ఎలా సాగుచేస్తాం? అంటూ తలలు పట్టుకుని సుమారు ఏడాది కాలం ఆ దరిదాపునకు వెళ్లలేదు.

సాగుకు గిరిజనులు వెనుకాడుతున్న విషయం స్థానిక ఉపాధి హామీ సిబ్బంది ద్వారా

మానసిక స్థైర్యం నింపి..

డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి వరకు వెళ్లింది. తెలిసిందే తడువుగా డ్వామా పీడీ మొదలుకుని స్థానిక అధికారులు, సిబ్బంది ఆ గ్రామాన్ని సందర్శించి, గిరిజనులతో మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించి భూమి సాగుచేస్తామనుకుంటే ప్రభుత్వం తరపున ఉచితంగా పండ్ల మొక్కలు అందజేస్తామని హామీ ఇచ్చారు. 'తాడు ఉందని గేదెను కొనగలమా? అన్నట్టు మీరు మొక్కలు ఇస్తారని సాగునీరు లేక రాళ్లు రప్పలతో నిండివున్న కొండవాలు ప్రాంతంలో సాగుచేసుకోగలమా' అంటూ కుశలంగా ఎదురు ప్రశ్నలు వేశారు గిరిజనులు. దీంతో, ఆ మరుసటి రోజే గిరిజనులకు కేటాయించిన భూమితోపాటు దానికి ఎగువ భాగంలో ఉన్న కొండశిఖరాలను కూడా పరిశీలించారు డ్వామా అధికారులు, సిబ్బంది. ఆపైనుంచి జాలువారుతున్న సన్నటి నీటి ధారను గుర్తించారు. దాన్ని ఒడిసిపట్ట రైతులకు ఉపయోగపడే విధంగా మళ్లించాలని సంకల్పించారు. మరోవైపు పండ్లతోటలకు ఎంతో అనువైన భూమి అంటూ గిరిజనుల్లో మానశిక స్థైర్యాన్ని పెంచారు. మనో నిబ్బరాన్ని కల్పించారు. మొక్కల పెంపకానికి నీటి సదుపాయం కల్పిస్తామని కూడా హామీ ఇచ్చారు. అధికారులు ఇచ్చిన నిబ్బరంతో గిరిజనులు తమకు కేటాయించిన భూముల్లోని రాళ్లగుట్టలను రాసిరంపాన పట్టారు. ఎవరికి కేటాయించిన భూమిలో వారే ఇంటిల్లిపాది కలిసి చదును చేశారు.

ఔను! చాలా ఆనందంగా ఉంది



రామతీర్థం కొండపై గిరిజనులు మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉంది. ఆ ప్రాంతమంతా రాళ్లగుట్టలతో నిండి ఉండడం వల్ల వారు ముందుకు రాలేదు. ప్రభుత్వం తరపున సాయం అందిస్తామని చెప్పడమే కాదు. కొండనీటి ధారను మళ్లించి, ఫారం పాండ్లు ఏర్పాటుచేయడంతో వారిలో ఆశలు చిగురించి సాగుకు ముందుకు వచ్చారు. ఇందులో మా ప్రయత్నం కన్నా వారి సంకల్పం గొప్పది.

- జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ



పెరిగిన మొక్క వద్ద గిరిజనుడు

నీటిధారను ఒడిసిపట్టి..

గిరిజనులకు ఇచ్చిన మాట ప్రకారం డ్వామా అధికారులు కూడా సాగుభూమికి దగ్గర్లో ఫారంపాండ్లు తయారు చేసి, అందులోకి కొండరాళ్ల నుంచి జారువాలుతున్న నీటి ఊటను మళ్లించారు. జీడి, మామిడి మొక్కలను ఉచితంగానే పంపిణీ చేశారు. నాటిన మొక్కలకు ఫారం పాండ్ల నుంచి గిరిజనులు కావుళ్లతో నీటిని తెచ్చి సాగుచేశారు. ఇదంతా ఏడాది క్రితం మాట. ఇప్పుడు ఆ మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. మరో రెండేళ్లలో ఫలసాయాన్ని సైతం అందించే పరిస్థితి కనిపిస్తోంది. అయితే మొక్కలు పెరుగుతున్న కొద్దీ ఇప్పుడున్న నీటి వసతి సరిపోదన్నది గిరిజన రైతుల నోట వినిపిస్తున్న మాట. విద్యుత్ కనెక్షన్‌తో కూడిన బోరు లేదా లిఫ్ట్ ఇరిగేషన్ సదుపాయం కల్పిస్తే గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపి నట్టు అవుతుందనడంలో సందేహం లేదు.

ఉపాధి అధికారుల సాయంతోనే సాగు



మాకు ఇచ్చింది ఎందుకూ పనికిరాని భూమి అనుకున్నాం. ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది చెప్పినా సాగు చేసేందుకు చాలా కాలం సాహసించలేకపోయాం. చివరకు వాళ్లే కొండపైనీటి ధారను మాకోసం ఒడిసి పట్టినప్పుడు అచేతనంగా ఉండలేకపోయాం. వారిచ్చిన హామీతో కొండను చదునుచేసి, మళ్లతుప్పలను తొలగించి చదునుగా మార్చుకున్నాం. ఇప్పుడు సాగుపైనే కాదు బతకుపైనా భరోసా కనిపిస్తోంది. అయితే, ప్రస్తుతం ఉన్న నీటి సదుపాయం భవిష్యత్తులో సరిపోదు. కాబట్టి, ఏదో రకంగా నీటి వసతిని ప్రభుత్వమే పెంచాలని కోరుతున్నాం.

- కొమరాపు ఆదిలక్ష్మి, రామతీర్థం, నెల్లిమర్ల మండలం



కావిళ్లతో నీటిని తీసుకెళ్తున్న గిరిజనులు



చికెన్ షాపుల వద్ద బారులు తీరిన జనం

కొండెక్కిన కోడి

మాంసం ధరలకు రెక్కలు ● బారులు తీరిన జనం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

సంక్రాంతి కనుమ పండుగతో మాంసం ధరలకు రెక్కలు వచ్చాయి. పండగ డిమాండ్‌తో ఒక్క సారి మాంసం ధరలు పెంచి అమ్ముతున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కనుమ పండుగ సందర్భంగా మాంసం ప్రతి ఇంటిలో వండనుండటంతో ఇదే అవకాశంగా రూ.180 చికెన్ కేజీ ధరను రూ. 230లకు పెంచేశారు. మటన్ కేజీ రూ.750 నుంచి రూ.850 పెంచేసి అమ్ముతున్నారు. చేపలు కేజీ రూ. 140 నుంచి 180కి పెంచి అమ్ముతున్నారు. పండగ నేపథ్యంలో అందరూ మాంసం వంటలు చేయనుండటంతో ధరలు పెంచి అమ్ముతున్నారు. మరో వైపు కనుమ పండుగ సోమవారం కావడం, ఆ రోజు మాంసం ఎక్కువగా తినక పోవడంతో మంగళవారం విజయనగరంలో నలుమూలల చికెన్, మటన్, చేపలు మార్కెట్లో జనం కిక్కిరిసి ఉన్నారు.

ప్రతిఒక్కరూ మాంసం కొనుగోలు కోసం విక్రయ కేంద్రాలు వద్ద భారులు తీరారు. ప్రధానంగా కంటోన్మెంట్ గణేష్ కోవెల జంక్షన్, రింగ్ రోడ్డు చేపల మార్కెట్, అర్ అండ్ బి చేపల మార్కెట్, యూత్ హాస్టల్ వద్ద, గూడ్స్ షేడ్, పాత బస్ స్టాండ్ వద్ద, వై జంక్షన్ వద్ద ఉన్న మాంసం విక్రయ కేంద్రాలు వద్ద అధిక సంఖ్యలో కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

సేవా దృక్పథంతో పనిచేయాలి

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలో వార్డు వాలంటీర్లు సేవా దృక్పథంతో పని చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర సూచించారు. మంగళవారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో 15 మంది వాలంటీర్లకు నియామక పత్రాలను ఆయనతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు అందజేశారు. కొద్దిరోజులపాటు మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న 19 వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. వీరిలో ఎంపికైన 15 మందికి నియామక పత్రాలను అందజేశారు. మిగిలిన నాలుగు పోస్టులకు సంబంధించిన రిజర్వుడు కేటగిరీలో అభ్యర్థులు దొరక్కపోవడంతో భర్తీకి నోచుకోలేదు. ఇప్పటికే రెండు సార్లు వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించినా భర్తీకి అధికారులు చర్యలు తీసుకోలేదు.

మూడోసారి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వాలంటీర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. చైర్ పర్సన్ ఈశ్వరమ్మ, ఇతర కౌన్సిలర్ల మధ్య అవగాహన కుదరడం, ఏ వార్డులో వాలంటీర్ పోస్టు ఖాళీ ఉంటే సంబంధిత కౌన్సిలర్ సిఫార్సు ప్రకారం భర్తీ చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆదేశించారు. దీంతో వాలంటీర్ పోస్టుల భర్తీకి లైన్‌క్లియర్ అయింది. మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చూడాలని కోరారు.

దళారుల బారిన ధాన్యం రైతు

వ్యాపారులదే ఇష్టారాజ్యం ● ఇతర జిల్లాలకు తరలిపోతున్న ధాన్యం



ప్రజాశక్తి-బొబ్బిలి

ధాన్యం రైతులను దళారులు నిలువునా దోపిడీ చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తిగా కొంటామని ప్రకటించినా ఆచరణలో అమలు చేయడం లేదు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు ఇచ్చిన ధరకు రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.2040 మద్దతుధర ప్రకటించినప్పటికి దళారులు రూ.1600 నుంచి రూ.1800 వరకు కొనుగోలు చేస్తున్నారు.

ఉభయగోదావరి జిల్లాలకు..

ప్రభుత్వం ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో ఇతర జిల్లాల మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి మిల్లర్లు రైతులు నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించుకుపోతున్నారు. క్వింటా ధాన్యాన్ని రైతుల నుంచి రూ.1800కు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తే రవాణా, హమాలీలు ఛార్జీలు, గొనె సంచి ధరలను రైతులే భరించాలి. ఉభయగోదావరి జిల్లాల మిల్లర్లకు ధాన్యం విక్రయిస్తే రవాణా ఛార్జీ తగ్గుతుంది. దీంతో పిరిడి, కమ్మవలస, దేవుపల్లి, తదితర గ్రామాల రైతులు ఉభయగోదావరి జిల్లాల మిల్లర్లకు విక్రయిస్తున్నారు.

దళారులదే ఇష్టారాజ్యం

ధాన్యం రైతులను దళారులు దోపిడీ చేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల మిల్లర్లు క్వింటా ధాన్యాన్ని రూ.1800కు కొనుగోలు చేస్తే, స్థానిక వ్యాపారులు, దళారులు రూ.1600 వరకు మాత్రమే ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించినా ఆచరణలో పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం లేదు.

పొలాల్లో ధాన్యం కుప్పలు

ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగడంతో రైతులు వరి నూర్పిడి చేయకుండా పొలాల్లో కుప్పలు వేసి నిల్వ చేస్తున్నారు. చింతాడ, పిరిడి, కలవరాయి, పక్కి, శివడవలస, ఎం.బూర్జవలస, పెంట, కృష్ణాపురం, తదితర గ్రామాల్లో పొలాల్లో నేటికీ వరికుప్పలు దర్శనమిస్తున్నాయి. పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టణాలకు తిరుగుముఖం

భోగి.. పెద్దపండగ... కనుమ.. ముక్కనుమ ముగిశాయి. భోగి మంటలు.. ముగ్గుల పోటీలు.. డూడూ బసవన్నలు.. హరిదాసు కీర్తనలు, కబడ్డీ కేకలు.. క్రికెట్ కేరింతలు.. వంటకాల ఘుమఘుమలు... పేరంటాల సందళ్లు... కనుమ పూజలతో కళకళలాడిన గ్రామసీమలు ఖాళీ అవుతున్నాయి. ఉద్యోగం, ఉపాధి కోసం ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా సంక్రాంతికి సొంతూళ్లు వచ్చి బరువెక్కిన హృదయాలతో తమ వారికి బై... బై చెబుతూ మళ్లీ వలస బాట పడుతున్నారు. దీంతో నాలుగు రోజులపాటు కళకళలాడిన పల్లెలు ఒక్కసారిగా బోసిపోతున్నాయి.



తిరుగు ప్రయాణంలో విజయనగరం బస్టాండ్ వద్ద బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సంక్రాంతి పండుగకు వచ్చిన వారంతా పట్టణాలకు తిరుగుముఖం పడుతున్నారు. దీంతో బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోగా, రోడ్లన్నీ రద్దీగా దర్శనమిస్తున్నాయి. ముచ్చటగా మూడు రోజులపాటు జరిగిన భోగి, సంక్రాంతి, కనుమ పండగలో బంధువులు, స్నేహితులు పరస్పర కరచాలనం, అనురాగం, ఆప్యాయత, పలకరింపులు ఒకింత ఉత్తేజ పరిచాయి. అందరిలోనూ ఉద్వేగాన్ని నింపాయి. పండుగలో ప్రతి క్షణం తీపిగుర్తుగానే మిగిల్చింది. కనుమ, ముక్కనుమ రోజుల్లో పాడి పశువులను పూజించడం సంప్రదాయంగా వస్తుంది. జిల్లాలో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ఇటువంటి సందడి కూడా తగ్గింది. కానీ, ఈ ఏడాది మరో ప్రత్యేక కనిపించింది. ఉపాధి, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండి పండక్కి వచ్చినవారంతా తమ ఊళ్లలో ప్రత్యేకమైన సాంస్కృతిక కార్యక్రమాలతో సరదాగా గడిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నది తీర ప్రాంతాల్లోని ఇసుక తిన్నెలపై ఉల్లాసంగా సందడి చేశారు. మరోవైపు పండుగ ముగియడంతో గ్రామాల్లో తీర్థాలు ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వేర్వేరు చోట్ల ఉంటున్న ప్రజలు పట్టణాలకు బయలుదేరడంతో పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు నుంచి విజయనగరం, విశాఖవైపు వెళ్లే బస్సులన్నీ కిటకిటలాడాయి. గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. రైళ్లు కూడా రద్దీగా మారాయి. విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లే వారంతా ముందుగానే రిజర్వేషన్లు చేసుకున్నారు. రిజర్వేషన్లు లేని వారిని ప్రయివేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించారు. ఇదే అదునుగా ప్రయివేటు ట్రావెల్స్ ఛార్జీలను విపరీతంగా పెంచేశాయి.

రోడ్డు విస్తరణ పనులకు నేడు శంకుస్థాపన

ప్రజాశక్తి- విజయనగరం

రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రాజాం మునిసిపాలిటీలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్టు రోడ్లు భవనాల శాఖ ఇ.ఇ. బి.వి.రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం - పాలకొండ రోడ్డులో 47వ కిలోమీటరు నుంచి 51వ కి.మీ వరకు పట్టణ పరిధిలో విస్తరణ జరుగుతుందన్నారు. నాలుగు కిలోమీటర్ల పరిధిలో రోడ్డును రూ.16.67 కోట్లతో 80 అడుగులకు విస్తరించనున్నట్టు తెలిపారు. నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించనున్న ఈ రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా డ్రెయిన్లను కూడా నిర్మిస్తామని, సెంట్రల్ డివైడర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. విజయనగరం జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆదర్శమూర్తి జ్యోతిబసు

సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-సీతానగరం

కమ్యూనిస్టు ఉద్యమ తొలితరం నేత, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు అందరికీ ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. జ్యోతిబసు 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండలంలోని చినబోగిలి గ్రామంలో ఆయన చిత్రపటానికి రెడ్డి వేణు, బోరపురెడ్డి అప్పారావు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి 23 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా జ్యోతిబసు అనేక సేవలు అందించి చరిత్రలో సృష్టించారన్నారు. అధికారం అలంకరణ కాదని, ఆడంబరం కాకూడదని, ఆపన్నులకు తోడుగా నిలవాలని, అవసరం ఉన్నవారికి అండ కావాలని జ్యోతిబసు ఆశించి.. ఆచరించారని కొనియాడారు. దున్నే వాడికి భూమిహక్కు ఉండాలని కోరుకున్నారని తెలిపారు. జ్యోతిబసు స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.ఈశ్వరరావు, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, కౌలు రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిబసు వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

బోసిపోయిన నగరం

ఖాళీగా ఉన్న రోడ్లు, మార్కెట్



నిర్మానుష్యంగా ఉన్న గంటస్థంభం రోడ్డు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలకు ప్రజలు తరలి వెళ్లడంతో విజయనగరంలోని రోడ్లు, మార్కెట్ ప్రాంతాలు బోసిపోయాయి. మంగళవారం మక్కనుమ పండగ కావడంతో నగరంలో వాహనాలు రాకపోకలు, రోడ్లు మీదకు వచ్చే ప్రజలు సంఖ్య బాగా తగ్గింది. దీంతో నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఎంజీ రోడ్డు, బాలాజీ జంక్షన్ రోడ్డు, పుచ్చల వీధి, పాత బస్ స్టాండ్, కలెక్టరేట్ ప్రాంతాల్లో వాహనాలు తాకిడి తగ్గడంతో పాటు, మార్కెట్‌లోకి ఎవ్వరూ రాకపోవడంతో రోడ్లు అన్ని నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన మార్కెట్లలో ఫుట్ పాత్ వ్యాపారులు తప్ప ప్రధాన వ్యాపార సంస్థలు, షాపులు అన్ని మూతపడ్డాయి. షాపుల్లో పని చేసే కార్మికులకు పండగ సెలవులు ఇవ్వడంతో ప్రధాన షాపులు మూతపడ్డాయి.



నిత్యం రద్దీగా ఉండే కోట జంక్షన్ మంగళవారం ఇలా..



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి బొత్స, జెడ్పి చైర్మన్ మజ్జి, ఎంపి బెల్లాన

సంక్రాంతి సంబరాల్లో మంత్రి బొత్స

మెరక ముడిదాం : రాష్ట్ర విద్యా శాఖమంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం సోమలింగాపురం సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఏటా సంక్రాంతి రోజున మంత్రి బొత్స సోమలింగాపురంలోని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సిరిపురం వెంకటరమణ రాజు ఇంటికి వెళ్లి తేనేటి విందు స్వీకరించి పార్టీ నాయకులతో మాట్లాడటం ఆనవాయితీ. అందులో భాగంగా మంగళవారం మిగితా నాయకులతో కలిసి అక్కడికి చేరుకుని తేనేటి విందు స్వీకరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న వైద్యులు

ఫ్యామిలీ కాన్సెప్ట్ వైద్య సేవలు

వేపాడ : వల్లంపూడి గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్ఆర్ ఫ్యామిలీ కాన్సెప్ట్ సేవలను మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కోవిడ్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమ దూరం పాటించాలన్నారు. ప్రస్తుత గ్రామాల్లో జరుగుతున్న జాతరలలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కోవిడ్ బారిని పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలను పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, ఎమ్మెల్ హెచ్పిబి కోమలి, ఏఎన్ఎం పి వెంకటలక్ష్మి, ఎంపిహెచ్ఒ సత్య, నారాయణ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

విజయనగరం టౌన్ : సంక్రాంతి సందర్భంగా 35 మంది అనాథ పిల్లలు కొత్త బట్టలు కోరుతున్నారని ఒక పోస్ట్ పెట్టగానే స్పందించి దాతలు సహకారంతో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారికి కొత్త బట్టలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్తమస్ యూత్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రక్తదాతలను సత్కరిస్తున్న సాధన యువజన సంఘం సభ్యులు

పండగలోనూ రక్తదానం

నెల్లిమర్ల : పండగ పూట సాధన యువజన సంఘం సేవ బాట పట్టింది. మంగళవారం భోగాపురానికి చెందిన కె.వి. శ్వేత అనే గర్భిణి విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. ఆమెకు అత్యవసర పరిస్థితుల్లో ఓ నెగిటివ్ బ్లడ్ కావాలని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో పేషెంట్ బంధువులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది జర జాపు పేటకు చెందిన సాధన యువజన సంఘానికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆ సంఘానికి చెందిన నేవి ఉద్యోగి కంటుబుక్త నాగరాజు, ఎయిర్ ఫోర్స్‌లో పనిచేస్తున్న మాషాడ సురేష్ ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్‌లో రక్త దానం చేశారు. వీరిని సాధన యువజన సంఘం ప్రతినిదులు పొలుభోతు దుర్గాప్రసాద్, పసుమర్తి వెంకటరమణ, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకు ఇంచార్జి నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ సందీప్, పేషంట్ బంధువులు అభినందించారు.

నేడు ఎన్‌టిఆర్ 27వ వర్ధంతి

వేపాడ : ఎన్‌టిఆర్ వర్ధంతిని బుధవారం వేపాడ, వల్లంపూడి కూడలి వద్ద నిర్వహిస్తామని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ కోట నియోజకవర్గం నాయకులు గొంప కృష్ణ హాజరవుతారని, మిగతా నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు



అర్చకుల ఆశీర్వచనం పొందుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పైడితల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన కోలగట్ల

ప్రజాశక్తి - విజయనగరంటౌన్

మూడు లాంతర్లు జంక్షన్ వద్ద ఉన్న చదురు గుడిలో పైడితల్లి అమ్మవారిని మంగళవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు సాదర స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని విస్తృత పరిచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని లక్ష్యం పని చేస్తున్నామన్నారు. ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వ్యాపారులకు ఇస్తున్నామన్నారు. త్వరితగతిన ఆలయాన్ని అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, నిత్య అన్నదనాన్ని ఈ ప్రాంతంలోనే కొనసాగించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట దేవాలయ పాలకమండలి సభ్యులు ఎంకెబి, పతివాడ వెంకటరావు, వెత్స శ్రీనివాసరావు, గంధం లావణ్య, చిల్లా పుష్ప, రామ్ సింగ్ సూరమ్మ, పార్టీ నాయకులు వేత్సా సాయి, చిల్ల వాసు, గంధం హరిబాబు, గొల్లపూడి మాధవరావు, వంకాయలపాటి శ్రీనివాసరావు, ముద్దాడ రాజు తదితరులున్నారు.

అభివృద్ధికి నోచుకోని గడిగెడ్డ

● రివర్స్ టెండరింగ్‌తో మధ్యలో నిలిచిపోయిన చప్టా పనులు ● ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా సాగునీరు సాధ్యమేనా..! ● క్షేత్రస్థాయిలో ప్రారంభంకాని పనులు

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో ఏకైక సాగునీటి ప్రాజెక్టు అయిన గడిగెడ్డ రిజర్వాయర్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ వల్ల చప్టా పనులు మధ్యలో నిలిచిపోయాయి. కాగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా గడిగెడ్డకు సాగునీరందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అభివృద్ధి కాని గడిగెడ్డ వరకూ సుజల స్రవంతి నీరు వెళ్లడం సాధ్యమేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందు గడిగెడ్డను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



మధ్యలో నిలిచిపోయిన చప్టా నిర్మాణ పనులు

గడిగెడ్డ ప్రాజెక్టు నుంచి 2,990 ఎకరాలకు సాగునీరు అందుతోంది. 1966 నుండి రైతులకు సాగునీరు అందిస్తూ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుంది. రిజర్వాయ్యర్ కుడి కాలువ ద్వారా పకీరుకిట్టలి, బూర్లి పేట, పల్లిగండ్రేడు, గరికివలస, గజపతినగరం మండలం కెంగువ గ్రామానికి సాగునీరు అందించగా ఎడమ కాలువ ద్వారా తెట్టంగి, గూడెం, పాలవలస, పున్నపురెడ్డి పేట గ్రామాలకు సాగునీరు అందిస్తుంది. ఖరీఫ్ సాగులో వరి పంటకు నీరు అందిస్తూ వేసవికాలంలో నెల్లిమర్ల విజయనగరం పట్టణాలకు తాగునీటిని సైతం అందిస్తోంది.

గడిగెడ్డకు తోటపల్లి నీరు

గత టిడిపి ప్రభుత్వంలో తోటపల్లి నుండి గడిగెడ్డకు సాగునీరును అందించారు. గడిగెడ్డ అభివృద్ధి పనులు కోసం 2018లో టెండర్లు పిలిచి గుత్తేదారులకు ప్రభుత్వం పనులను అప్పగించింది. ఈ పనులు మొదలుపెట్టే లోగా ఎన్నికలు సమీపించడం ఆ ఎన్నికల్లో టిడిపి పరాజయం పొందడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండర్లు క్రమంలో గడిగెడ్డ అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. కాగా తోటపల్లి నీరు కూడా గడిగెడ్డకు సకాలంలో రావడం లేదు. తోటపల్లి నీరును పూర్తిస్థాయిలో గడిగెడ్డకు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సుజల స్రవంతి నీరు తరలింపు సాధ్యమైనా.?



గడిగెడ్డ రిజర్వాయర్

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఎడమ కాలువ ద్వారా గడిగెడ్డ రిజర్వాయర్‌కు సాగునీరు అందించి, మరింత ఎక్కువ భూములకు సాగునీటిని అందించేందుకు కృషి జరుగుతుందని అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నా క్షేత్ర స్థాయిలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. కాలువ పనులు నిమిత్తం భూ సేకరణ కోసం అధికారులు ప్రజా అభిప్రాయ సేకరణ కోసం గ్రామ సభలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్ట్ నుండి ఉత్తరాంధ్ర సృజల స్రవంతి ద్వారా గడిగెడ్డ రిజర్వాయర్‌కు నీరు అందిస్తే గుర్ల, గజపతినగరం మండలాలు సస్యశ్యామలం అవుతుందని రైతులు అంటున్నారు.

ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సామాజిక ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమై సంవత్సరాల గడుస్తున్నా ఇంతవరకు పూర్తికాలేదు. మూడు సంవత్సరాల క్రితం సామాజిక ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణం ప్రారంభమైనా ఆసుపత్రి ఇంతవరకు పూర్తి కాలేదు. అప్పట్లో ప్రభుత్వం రూ.5 కోట్ల కేటాయించి నిర్మాణ పనులు కాంట్రాక్టరకు అప్పగించింది. అయితే నిధుల విడుదల కాక కొంత కాలం పనులు నిలిచిపోయాయి. నిర్మాణం పూర్తికాపోవడంతో వైద్య సిబ్బంది, రోగులు పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా వైద్యం కోసం వస్తున్న రోగులు ఇరుకు ఇరుకు గదుల్లో ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. సామాజిక ఆసుపత్రికి రోజుకు 150 నుంచి 200 మంది వరకూ రోగులు వస్తుంటారు. వీరందరూ ఆసుపత్రి వారండాలోనే ఒపి తనిఖీలు చేయించుకుంటున్నారు. గదులు లేకపోవడంతో చాలా మంది ఆరుబయటే వైద్యం పొందుతున్నారు. వైద్యులు కూడా ఇరుకు గదుల్లో సేవలందిస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో 20 మంది వరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గదులు సౌకర్యం లేక వైద్యులు, సిబ్బంది, రోగులు ఒకే చోట ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, మందులు ఉన్నప్పటికీ గదులు కొరత వల్ల వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఏక్షరే ప్లాంట్ ఉన్నా గది సౌకర్యం లేక వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైనా సామాజిక ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.



నిర్మాణంలో ఉన్న సిహెచ్‌సి

నిర్మాణం పూర్తయితే మరింత మెరుగైన వైద్యం

అన్ని సౌకర్యాలు ఉన్నా గదులు చాలక ఇబ్బందులు పడి సేవలు అందిస్తున్నాం. గదులు నిర్మాణం పూర్తయితే మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.

డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కె. శ్రీనివాసరావు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ముఖ్యంగా చంపావతి నది పరివాహక ప్రాంతం మొయిద కాజ్‌వే సమీపంలో ఇసుక తవ్వకాలు జరిపి రైలు పట్టాల వద్ద డంప్ చేసి రాత్రుళ్ళు లారీల ద్వారా తరలిస్తున్నారు. మిల్ బ్రిడ్జి వద్ద నీటి పథకాల వద్ద కూడా మిని ఆటోలు, ఏడ్లు బళ్ళు ద్వారా ఇష్టానుసారంగా రవాణా జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులు మంచి నీటి పథకాల వద్ద కూడా ఇసుక తవ్వకాలు జరపడంతో అవి కూలిపోయే ప్రమాదం ఉంది. సదరు ఇసుక అక్రమార్కులు ప్రభుత్వ యంత్రాంగానికి నెలవారీ మామ్ముల్లు ఇస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇంత జరుగుతన్నా ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వ యంత్రాంగం మాకెందుకులే అన్నట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు దారి తీస్తుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకొని మంచి నీటి పథకాల పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



రైలు పట్టాల సమీపంలో డంప్ చేసిన ఇసుక

ఆక్రమణల జోరు.. ఎవరూ పట్టించుకోరు..

● రహదారులపై ఇష్టానుసారంగా నిర్మాణాలు

● రోడ్లపైనే వాహనాల నిలిపివేతతో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండల కేంద్రం నిత్యం రద్దీగా ఉండే నాలుగు రోడ్ల కూడలి, విశాఖ అరకు- రోడ్డు, ఎస్.కోట -విజయనగరం మెయిన్ రోడ్డు లలో ఇష్టానుసారంగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇక్కడ పెత్తందారులు ఇష్టానుసారం రోడ్లను ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టారు. దుకాణాల నిర్వాహకులు సైతం రోడ్లమీదకు తమ షాపుల ముందు ఉన్న షెడ్లను తెచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కాలేజీ గ్రౌండ్‌కు ఆనుకొని రోడ్డు మార్జన్‌లను షాపుల నిర్వాహకులు ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులు సైతం రోడ్లపైకి నిర్మించడం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. ఇక్కడే అధికంగా చికెన్, మటన్ దుకాణాలు ఉండడంతో వారికి కోళ్లను సప్లై చేసే వాహనాలు నిత్యం రోడ్లమీద ఆపటం వల్ల రెండో వాహనం పక్కనుండి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పైగా షాపులు రోడ్లమీదకు ఉండడంతో ద్విచక్ర వాహనాలు సైతం రోడ్లపైనే నిలపాల్సి వస్తుంది.



రోడ్డుమీదకు రేకుల షెడ్డును దించి సామాన్లను రహదారిపై పేర్చిన యజమానులు

నిత్యం మండల కేంద్రంలో ఈ రద్దీను దాటుకునే ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తిరుగుతున్నా ఆక్రమణలను చూసి చూడటన్లు వ్యవహరిస్తున్నారు. తెల్లవారుజామున పాత బస్టాండ్ వద్ద పరిస్థితి వాహనదారులకు నిత్యం నరకయాతనే. ఇక్కడ రోడ్డుమీద కూరగాయల మార్కెట్ నిర్వహిస్తుండడంతో ఉదయం పూట ఈ రోడ్డుమీద నడవడానికి సైతం ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసరాల్లోనే ఉన్న ఎల్ఐసి కార్యాలయం, ముంతాజ్ హోటల్‌కు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లమీద వాహనాలను నిలిపేసి వెళ్లిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత బాధ్యత వహించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుంటే ఇక ఎవరిని నిందించాలో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

చినుకు పడితే మరింత ఇబ్బంది

ప్రధాన రహదారిలో చిన్నపాటి వర్షం కురిసినా నీరు రోడ్డుపై నిల్వ ఉండిపోతుంది. ఆర్‌టిసి కాంప్లెక్స్, రైతు బజార్ వద్ద నడిచేందుకు వీలులేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. పోలీసులు సైతం ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. అధికారులు వెంటనే స్పందించి రోడ్ల వెంట ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తొలగించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని శాఖలు కలిసి వస్తేనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



ఎల్ఐసి కార్యాలయం వద్ద ఇరుకుగా ఉన్న రహదారి

పట్టణంలోని తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే. షాపుల యజమానులు రోడ్ల మార్జెనుల వరకు షెడ్లను నిర్మించటం వల్ల వినియోగదారుడు వాహనాలను రోడ్లపైనే నిలపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అన్ని శాఖల సహాయం తీసుకోవలసి ఉంటుంది. అన్ని శాఖలకు లెటర్లు పెడతాం. అందుకు సహకరిస్తే పోలీస్ ప్రొడక్షన్ పెట్టి ట్రాఫిక్ సమస్యకు ముగింపు పాడుతాం.

తారకేశ్వరరావు, ఎస్ఐ, శృంగవరపుకోట

సచివాలయ ఉద్యోగుల గైర్హాజర్

● 70 శాతానికి పైగా సిఎల్‌లు మంజూరు

● కొన్ని సచివాలయాలలో ఇద్దరే..

● మరికొన్నింటికి తాళాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 25 గ్రామ సచివాలయాలలో 70 శాతానికి పైగా ఉద్యోగులు విధులకు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ సెలవులు 14, 15, 16 కాగా 17న మంగళవారం 12 శాఖల ఉద్యోగులు విధులకు హాజరు కావలసి ఉండగా, కేవలం ఇద్దరు లేదా ముగ్గురు ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. మిగతా ఉద్యోగులు హాజరు కాకపోవటంతో సచివాలయాలకు పనులు నిమిత్తం వచ్చిన ప్రజలు ఆయా శాఖాధికారులు లేక వెనుతిరగవలసిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఐదు గంటల వరకు విధులు నిర్వహించవలసి ఉంది. ఇందులో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు వివిధ శాఖ అధికారులు ప్రజలతో మమేకమై స్పందన కార్యక్రమం చేపట్ట వలసి ఉంది. కానీ ఆ దిశగా సచివాలయం ఉద్యోగులు చేయలేదు. కొన్ని చోట్ల ఒకరిద్దరు మాత్రమే విధులకు హాజరై మమ అనిపించారు. మరి కొన్ని సచివాలయాలకు పూర్తిగా తాళాలు వేసి ఉన్నాయి. ఉన్న సిబ్బందిని అడిగితే సిఎల్‌లో ఉన్నారని, మరి కొంతమంది మండల కేంద్రానికి వెళ్లారని చెబుతున్నారు.



చిన శిర్లాం సచివాలయంలో నిద్ర పోతున్న ఉద్యోగి

వచ్చినవారు కూడా నిద్రలోకే

సచివాలయాలలో మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే సచివాలయ ఉద్యోగులు ఆగడాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. సచివాలయ వ్యవస్థలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ పరిపాలన అధికారులుగా ఉన్నప్పటికీ వారికి కేవలం అడ్మినిస్ట్రేటర్‌గా ఉంచడంతో వారి మాటలను కూడా సచివాలయ ఉద్యోగుల వినే పరిస్థితి లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే మంగళవారం చాలా మంది ఉద్యోగుల రాకపోయిన మాట పక్కనే పెడితే వచ్చిన వారు కూడా శ్రద్ధగా పనిచేసిన పాపాన పోలేదు. అంబాడ వెంకటాపురం సచివాలయంలో ఇద్దరు ఉద్యోగులు హజరై మాటా మంతి అడుకుని విధులు ముగించగా చిన్న శిర్లాం సచివాలయంలో ఉద్యోగి విధులకు హాజరై చక్కగా ఫ్యాన్ కింద పడుకుని తన విధులను ముగించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అంబాడ వెంకటాపురం సచివాలయానికి హాజరైన ఉద్యోగుల వీరే



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

విస్తృతంగా వాహన తనిఖీలు

బొబ్బిలి : బెల్ట్ షాపులు, నాటుసారా నివారణకు ఎస్ఇబి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. పండుగ నేపథ్యంలో గ్రామాలలో బెల్ట్ షాపులకు వెళ్లే మద్యాన్ని, అమ్మకానికి తీసుకుని వెళ్లే నాటుసారా నివారణకు దిబ్బగుడివలస వద్ద ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించినా నాటుసారా అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.

లీకులతో నీరు వృథా

బొబ్బిలి : బెర్రీ, ఇంపెక్స్ పరిశ్రమలకు నీరు సరఫరా చేసే పైపులైన్ హిరా పరిశ్రమ సమీపంలో లీకవ్వడంతో నీరు వృధాగా పోతుంది. లీకులతో నీరు వృధాగా పోవడంతో పరిశ్రమలకు సంపూర్ణంగా నీరు అందడం లేదు. దీంతో నీటి కోసం పరిశ్రమ యజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. నీరు కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎపిఐఐసి అధికారులు స్పందించి పైపులైన్ లీకులను నివారించాలని, పరిశ్రమలకు సంపూర్ణంగా నీరు సరఫరా చేయాలని పరిశ్రమ యాజమాన్యాలు కోరుతున్నాయి.

వ్యక్తి మృతదేహం లభ్యం

తెర్లాం: మండలంలో వెలగవలస నుండి రాచగుమడాం వెళ్లే మట్టి రోడ్డు పక్కన ఉన్న వెలగవలస గ్రామానికి చెందిన చేపేన పాల్గొణరావు మామిడి తోటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని బొబ్బిలి డి.ఎస్.పి మోహన రావు తెలిపారు. అంతకుముందు మృతదేహాన్ని మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. వీపు మెడ పైన కత్తిపోట్లు ఉన్నాయని, తలపై గాయాలు న్నాయన్నారు. హత్య ఎక్కడో చేసి ఇక్కడ పడివేసినట్లు సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తుందని అన్నారు. సదరు వ్యక్తి 5,6 రోజులు క్రితం హత్యకు గురైనట్లు ప్రాథమిక అంచనా అని తెలిపారు. ఇతని వయస్సు 40 నుండి 50 మధ్య ఉంటుందన్నారు.

బిల్లులు పెంచడం దుర్మార్గం

నెల్లిమర్ల : కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా విద్యుత్ బిల్లులు పెంచాలని రాష్ట్రానికి ప్రతి పాదనలు పంపించడం దారుణమని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ప్రతి నెలా విద్యుత్ బిల్లులు పెంచడం వల్ల కార్మిక, కర్షక, సామాన్య ప్రజలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు పెంపుదల ప్రభావం కార్మిక వర్గంపై పడి పరిశ్రమలు మూతపడి ఉపాధి లేకుండా పోతుందన్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రతి నెలా విద్యుత్ బిల్లులు పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు ప్రతి పాదనలు పంపించడం అభ్యంతర కరమని పేర్కొన్నారు. కాగా వ్యవసాయ రంగం కూడా కుంటుపడి రైతులు విద్యుత్ బిల్లులు పెంపుదల వల్ల రైతులు కూడా సాగు చేసే పరిస్థితి ఉండదన్నారు. కాబట్టి ప్రతీ నెలా విద్యుత్ బిల్లులు పెంపుదల ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో అన్ని వర్గాల ప్రజలూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

బ్రహ్మలింగేశ్వరకొండపై జన సందోహం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని గుడివాడ, కరకవలస, చామలాపల్లి, జాకీరు, జగ్గయ్యపేట, సింగరాయి, ఏఎస్ పేట, వల్లంపూడి, వేపాడ, ఆతవ గ్రామాల మధ్యలో ఎత్తయిన కొండపై ఉన్న బ్రహ్మ లింగేశ్వర ఆలయం యాత్రకు జనం పోటెత్తారు. జాకేరు, గుడివాడ గ్రామాల సింహాద్రి అప్పన్న భక్తులు తౌవుడు పెద్దలను భక్తి భావాలతో భజనలు చేసుకుంటూ శివాలయానికి తోడ్కొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. శివాలయంలో ఆలయ అర్చకులు లట్టాల శంకర్ శర్మ, పవన్ భక్తులను ఆశీర్వదించి పూజలు నిర్వహించారు.

ఘనంగా జగన్నాథ స్వామి తీర్థం

మండలంలోని ముకుందపురం గ్రామంలో జగన్నాథ స్వామి తీర్థం, వల్లం పూడి గ్రామంలో రామాలయ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మలింగేశ్వర కొండపై సందడి చేస్తున్న భక్తులు, పర్యాటకులు

నేడు దుర్గాలమ్మ, పరదేశమాంబ తీర్థం

మండలంలో దుర్గాలమ్మ తీర్థం సింగరాయి లోనూ, పరదేశమాంబ తీర్థం వీలుపరితి గ్రామంలోనూ వైభవంగా నిర్వహించనున్నామని ఆయా గ్రామాల సర్పంచులు సేనాపతి లీల, ఎన్ వెంకట్రావులు తెలిపారు పరిసర ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.